**Andhra Jyothi**

# వ్యవసాయ శాఖలో ఉద్యోగాల భర్తీ ఏదీ?

- **మూడు నోటిఫికేషన్లకు కోర్టు వివాదాలతో బ్రేక్**
- **ఏడాదిగా ఎంపికైన అభ్యర్థుల ఎదురుచూపులు**

నల్లగొండ, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖలో ఉద్యోగాల భర్తీకి గ్రహణం పట్టింది. ఆ శాఖలో ఏడాదిగా ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ వెలువడుతున్నా కోర్టు కేసులతో నియామక ప్రక్రియ అటకెక్కుతుంది. గత ఏడాది సెప్టెంబర్ నుంచి ఈ ఏడాది జూన్ వరకు 3 నోటిఫికేషన్లు వెలువరించి 1430మంది అభ్యర్థుల ఎంపిక పూర్తయినా కాంట్రాక్ట్ ఉద్యోగుల పిటిషన్లతో భర్తీకి అడ్డంకులు ఏర్పడుతున్నాయి. రాష్ట్ర విభజన నేపథ్యంలో ట్రిబ్యునల్ మనుగడ ప్రశ్నార్థకమవడంతో ఇప్పట్లో ఈ సమస్య పరిష్కారమయ్యేలా లేదు. 2015 సెప్టెంబర్‌లో ఏవో (అగ్రికల్చర్ ఆఫీసర్) పోస్టులకు నోటిఫికేషన్ వెలువడింది. 120 పోస్టులకు 2 వేల మంది దరఖాస్తు చేసుకోగా 2015, అక్టోబర్ 17న పరీక్ష నిర్వహించారు. 2016 సెప్టెంబర్‌లో అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయింది. ఈ తరుణంలో ఆత్మ ప్రాజెక్టులో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న బీటీఎం(బ్లాక్ టెక్నాలజీ మేనేజర్), ఏటీఎం(అసిస్టెంట్ టెక్నాలజీ మేనేజర్)లు తమకు ఉద్యోగ భర్తీలో వెయిటేజ్ ఇవ్వాలని ట్రిబ్యునల్‌ను సంప్రదించారు. ఆపై హైకోర్టును ఆశ్రయించారు. విషయం ట్రిబ్యునల్‌కు సంబంధించినది గనుక అక్కడే తేల్చుకోవాలని హైకోర్టు సూచించింది. తాజా పరిణామాల నేపథ్యంలో ట్రిబ్యునల్ మనుగడే ప్రశ్నార్థకంగా మారడం, హైకోర్టులో కేసుల పెండింగ్ సంఖ్య అధికంగా ఉండటంతో ఉద్యోగాలు పొందినవారు ఎటూ తేల్చుకోలేకున్నారు. ఈ ఏడాది జనవరిలో అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ వెలువడింది. 311 పోస్టులకుగానూ 4వేల మంది పోటీపడగా 2016 ఏప్రిల్‌లో ఎంపికైన వారి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తయింది. కాంట్రాక్ట్ ఉద్యోగులు వెయిటేజీ కోసం కోర్టుకు వెళ్లారు. మేలో మరో దఫా 1000ఏఈవో పోస్టులకు నోటిఫికేషన్ వెలువడగా 7వేలమంది పోటీపడ్డారు. ఈ పోస్టుల పైనా కాంట్రాక్ట్ ఉద్యోగులు కోర్టుకు వెళ్లడంతో ఏడాది కాలంగా ఎంపికైన వారికి నిరీక్షణ తప్పలేదు.